# మినీకథ పొదుపు

—కందేరి వెంకట రామయ్య



**లంచ్ అవర్.**

**అందరూ లేచి వెడుతున్నారు.**

ఆమె టైపు చెయ్యడం ఆపి, టేబిలు మీద ఫేన్‌గాలికి రెపరెప లాడుతున్న కాగితాన్ని సర్ది, మెల్లగా తల పైకెత్తి తన కెదురుగా వున్న టేబిలువైపు చూసింది.

అతను ఆమెవైపే చూస్తున్నాడు. ఆమె తనవైపు చూడగానే నవ్వుతూ లేచి ఆమె దగ్గరికి వచ్చాడు.

"ఈ రోజు కూడా క్యాంటీన్‌లోనేనా భోజనం" ఆమె కళ్లల్లోకి చూస్తు అతను అడిగాడు.

ఆమె అతని కళ్లల్లోకి చూసి అవునన్నట్టు తలవూపింది.

ఇద్దరూ క్యాంటీన్ వైపు నడిచారు.

క్యాంటీన్‌లో ఓ మూల కూర్చుని లంచ్ తీసుకుంటూ ఆమె బిడియంగా అటూ యిటూ చూస్తూ, ఎవరైనా చూస్తే బావుండదన్నట్టు నటిస్తూంది.

అతను మురిసిపోతూ, ఫరవాలేదు, ఈ రోజుల్లో ఇటువంటి మహానగరాల్లో ఆడామగా స్నేహాన్ని గురించి అంతగా పట్టించు కొనే వారెవడని ఆమెకు ఉపదేశం చేశాడు.

లంచ్ ముగించి ఇద్దరూ క్యాంటీన్ నుంచి బయటి కొచ్చారు.

"ఐ లైక్‌యూ, మీరు చాలా (ఫీగా వుంటారు" అందామె.

"నువ్వు మా(తం, మొదట ఏమో అనుకున్నాను. బోల్డుటైపు" అని ఆమె కళ్లల్లోకి చూశాడు

"మన పరిచయం ఎక్కడికి దారితీస్తుందో" అందామె.

"సాయం(తం సినిమాకి".

"ఏవిటి, సినిమాకా, నేనురాలేను బాబూ, ఎవరైనా చూస్తే బావుండదు." ఆమె కాస్తబెట్టుచేసింది.

"ఎవరూ చూడరు. లీలామహల్‌కి వెళదాం. వూరికి దూరంగా వుంది. పైగా పాతసినిమా, తెలిసిన వాళ్లెవరూ వచ్చే అవకాశం లేదు."

ఆమె సరేనంది.

సాయం(తం ఆరుగంటలు.

అతనూ, ఆమే కాస్త ముందూ వెనుకగా థియేటర్ దగ్గరికి వచ్చారు.

అతను రెండు బాల్కనీ టికెట్లు పట్టుకొచ్చాడు.

బాల్కనీలో ఓ మూల ఎవరూ లేని చోట యిద్దరూ కూర్చున్నారు.

ఆమెను అతను సినిమా సరిగ్గా చూడనివ్వలేదు.

సినిమా అయిపోయింది.

ఇద్దరూ బయటి కొచ్చారు.

హడావుడిగా నడుస్తున్న జనంలోంచి బయటపడి, రోడ్డుకటువైపు వెలుతురు కాస్త తక్కువగా వున్న చోట నడుస్తున్నారు.

అతను ఆమెకు చాలా దగ్గరగా నడుస్తున్నాడు. అప్పుడప్పుడూ ఏవో చిలిపి పనులు చెయ్యాలని (పయత్నిస్తున్నాడు.

ఆమె అతనికా అవకాశం ఇవ్వకుండా నడుస్తూంది.

"మిమ్మల్ని ఒక హెల్ప్ అడగాలనుకుంటున్నాను" ఆమె మెల్లగా తనలో తాను గొణుక్కుంటున్నట్టుగా అంది.

అతను వెంటనే ఆగి ఆమె చెయ్యిపట్టుకొని నన్నడగక మరెవ్వరిని అడుగుతా వన్నట్టు చూశాడు.

ఆమె మెల్లగా అతని చెయ్యి విడిపించుకుంటూ, "ఆ ఏవీలేదు, నెలాఖరుకదా. ఓ పాతిక సర్దితేచాలు. ఇప్పటికే నేను మీకు చాలా డబ్బులివ్వాలి. (పతినెలా ఏవో యిబ్బందులు. త్వరలోనే మీ డబ్బులు." అని ఆమె అతని వైపు ఓరగా చూసింది.

"ఛఛ, ఇంతగా అడగాలా, తప్పకుండా యిస్తాను" అతను జేబులోంచి పర్సుతీసి, ఆమెకి డబ్బిచ్చాడు.

ఆమె థాంక్స్ చెప్పింది.

అతను పొంగిపోయాడు. ఆమె ఓరిక్షాను పిలిచింది.

"అప్పుడే వెళ్లాలా, మరి కొంచెం దూరం కబుర్లు చెప్పుకుంటూ నడిచి వెళ్దాం" అన్నాడు అతను.

"చీకట్లో యిలా తారాడుతూ వుంటే ఎవరైనా చూస్తే బావుండదు. అయినా మన పరిచయం ఇలా సినిమాలకే పరిమితమా ఏవిటి. నాకు మీరంటే...ఎలా చెప్పను. నా జీవితంలో ఇదే ఫస్ట్ అండ్ లాస్ట్."

ఆమె మాటకి అతను పులకించి పోయాడు.

ఇంతలో రిక్షా వచ్చి పక్కనే ఆగింది.

ఆమె రిక్షాలో కూచుంటూ "ఆ విషయం మరిచిపోయారా" అంది. ఏ విషయం?"

"అదే-గ్యాస్ కనెక్షన్. అంత దూరం వెళ్లాలంటే నాకు వీలు పడటం లేదు. ఆయనకి ఎప్పుడు (టాన్స్‌ఫర్ అవుతుందో. ఇంట్లో ఇబ్బందిగా వుంది. త్వరగా చూడండీ" అంటూ రిక్షా అతను చూడకుండా అతని చేయి పట్టుకొని నొక్కింది. అతను వుత్సాహంతో రెచ్చిపోతూంటే రిక్షా అక్కడి నుంచి ముందుకు కదిలింది.

* * *

మరుసటి రోజు సాయం(తం అయిదుగంటలు. గాంధీనగర్‌లో ఓ యింటిలో నుంచి అతను చేతిలో కాలుతున్న సిగరెట్టుతో హుందాగా బయటికొచ్చాడు.

అతని వెనుక ఆమె కొద్దిగా తలవంచుకొని బయట కొచ్చింది.

'ఏవండీ?' ఆమె పిలిచింది.







ఏవీటన్నట్టు కొంత విసుగ్గా ఆమెవైపు చూశాడు అతను.

"పెద్ద బజారుకు వెళ్లాలంటే చాలా దూరం నడవాలి. ఇవాల కాళ్ళ నొప్పెడుతున్నాయి. రిక్షాలో వెళ్దామా" అంద ఆమె.

"రెండు రూపాయలు దండగ. సాయంకాలం ఆ మాత్రమైనా నడవకపోతే ఎలా?"

ఆమె. చేసేది లేక మౌనంగా అతనిని అనుసరించింద.

దారిలో ఓ చోట మల్లెపూలు.

మల్లెపూలు చూడగానే ఆమె మనసుపడింది.

"నడిరోడ్డులో అలంకరణేవిటి. నాకు నచ్చదు" అంటూ అతను ఆగకుండా ముందుకు వెళ్లాడు.

మెయిన్ రోడ్డులోకి వచ్చారు ఇద్దరూ.

వాళ్లకి కొంత దూరంలో కాఫి హోటలు.

హోటలు చూడగానే అతనికి తలనొప్పిగా వున్నట్టనిపించింది. కాఫీ తాగాలనుకున్నాడు. ఇద్దరూ లోపలికెళ్లారు.

ఆమె ఎప్పుడో గాని యిలాంటి హోటళ్లవైపు రాదు.

ఆమెకు ఏమైనా తినాలనిపించింది.

అతనే ఆర్డరిస్తాడుగదా అని మౌనంగా వుండి పోయింది.

అతను రెండు కాఫీలు ఆర్డరిచ్చాడు.

ఆమె టిఫిన్ తిందామంది.

అతనికి కోపం వచ్చింది. "దండగ ఖర్చు. ఎటూ ఇంకాసేపట్లో యింటికి వెళ్లి భోంచెయ్యాలి."

పొదుపును గురించి చిన్న ఉపన్యాసం ప్రారంభించాడు.

ఆమె కాఫి తాగి అతని వెనకే బయట కొచ్చింది.

అతని వెనుక నడుస్తూన్న ఆమె పొదుపు గురించి ఆలోచిస్తూంది.

అతను చెప్పింది నిజమే కదా. పొదుపు తప్పదు అనుకుంది.

పాపం ఈమె అతని భార్య.

